క్లుప్తంగా

ఓట్ల లెక్కింపునకు ప్రత్యేక ఏర్పాట్లు



జగ్గయ్యపేట: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జగ్గయ్యపేట నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కార్యక్రమం జూన్ నాలుగో తేదీన ఇబ్రహీంపట్నం వద్దనున్న నిమ్రా కళాశాలలో జరుగుతుందని రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఓట్ల లెక్కింపునకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని 2,05,364 మంది ఓటర్లకుగాను 1,84,575 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 89.88శాతం పోలింగ్ నమోదైందన్నారు. అత్యధిక పోలింగ్ నమోదైన నియోజకవర్గాల్లో జగ్గయ్యపేట రాష్ట్రంలోనే రెండోస్థానంలో నిలిచిందని తెలిపారు. ఓట్ల లెక్కింపు 16రౌండ్లుగా కొనసాగుతుందన్నారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో 200 మంది సిబ్బంది పాల్గొంటారని, ఇందుకోసం 14 టేబుళ్ల ఏర్పాటు చేస్తామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు నాలుగు టేబుల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగియడానికి, పోలింగ్ శాతం పెరగడానికి సహకరించిన ఎన్నికల సిబ్బందికి, పోలీసులకు, అన్ని రాజకీయపార్టీల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో ఏఆర్వో శేషగిరి, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిక్షణా తరగతులు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న జిల్లా గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. నాలుగోరోజు సోమవారం విద్యార్థులకు నీతికథలు బోధించారు. పుస్తక సమీక్ష నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు డి.నాగేశ్వరరావు విద్యార్థులకు తెలుగు వ్యాకరణంపై శిక్షణనిచ్చారు. బీడీసీ నాగమల్లిక ఆడపిల్లలకు అల్లికలకు సంబంధించిన విషయాలను నేర్పించారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, గ్రంథాలయ సిబ్బంది శ్యామల, సత్యవతి పాల్గొన్నారు.

వరిపాట్టు లోడు ట్రాక్టర్ బోల్తా



భీమవరం(వత్సవాయి): ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి వరిపాట్టు ట్రాక్టర్ బోల్తా కొట్టిన సంఘటన చిల్లకల్లు–వైరా రహదారిపై ఎన్నెస్పీ కాలువ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. చిల్లకల్లు వైపు నుంచి వస్తున్న వరిపాట్టు ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ ట్రక్కు బోల్తా పడగా, ఇంజిన్ పక్కనే ఉన్న పొలంలోకి దూసుకువెళ్లింది. అదృష్టవశాత్తూ ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు.

20చోట్ల 95 శాతానికిపైగా పోలింగ్

- జగ్గయ్యపేట నియోజకవర్గంలో మొత్తం 222 పోలింగ్ కేంద్రాలు
- 10శాతం కేంద్రాల్లో 95శాతానికిపైగా పోలింగ్
- అత్యధికం పోలింగ్ 97.53శాతం
- అతితక్కువ పోలింగ్ 75.63శాతం



ఓటేసేందుకు క్యూలైన్‌లో నిల్చున్న ఓటర్లు (ఫైల్)

జగ్గయ్యపేట : సార్వత్రిక ఎన్నికల్లో జగ్గయ్యపేట నియోజకవర్గంలోని 222 పోలింగ్ కేంద్రాలకుగాను 20కేంద్రాల్లో 95శాతానికిపైగా పోలింగ్ నమోదు కాగా, 135పోలింగ్ కేంద్రాల్లో 90శాతానికిపైగా పోలింగ్ నమోదైంది. జగ్గయ్యపేట నియోజకవర్గంలో జిల్లాలోనే అత్యధికంగా మొత్తం 89.88శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,05,364మంది ఓటర్లకుగాను పురుషులు 88,667మంది, మహిళలు 95,904మంది, థర్డ్‌జెండర్ ఓటర్లు నలుగురు కలిపి మొత్తం 1,84,575మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ముక్త్యాలలో అత్యధిక పోలింగ్..

జగ్గయ్యపేట మండలం ముక్త్యాలలోని 87వ నంబరు పోలింగ్ కేంద్రం పరిధిలో నియోజకవర్గంలోనే అత్యధికంగా 97.53శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ పురుష ఓటర్లు 337మందికిగాను 328మంది, మహిళా ఓటర్లు 351మందికిగాను 343మంది ఓటేసి నియోజకవర్గంలోనే రికార్డు సృష్టించారు. జగ్గయ్యపేట పట్టణంలోని పాత ఎన్నెస్పీ క్వార్టర్స్ వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో నియోజకవర్గంలోనే అతితక్కువగా 75.63శాతం పోలింగ్ నమోదైంది. జగ్గయ్యపేట పట్టణంలో మొత్తం 42పోలింగ్ కేంద్రాలు ఉండగా, కేవలం 8చోట్ల మాత్రమే 90శాతానికిపైగా పోలింగ్ నమోదైంది. జగ్గయ్యపేట పట్టణంలోని నాగమయ్య బజార్ స్కూల్(65వ నంబరు) పోలింగ్ కేంద్రంలో మాత్రమే పట్టణంలో అత్యధికంగా 94.62శాతం పోలింగ్ నమోదుకాగా, పాత ఎన్నెస్పీ క్వార్టర్స్‌లోని(45వ నంబరు)పోలింగ్‌కేంద్రంలో అతితక్కువగా 75.63శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తమ్మీద కూడా అతితక్కువ పోలింగ్‌శాతం నమోదైన పోలింగ్ కేంద్రం కూడా ఇదే. ఈ పోలింగ్ కేంద్రంలో పురుష ఓటర్లు 402మందికిగాను 300మంది, మహిళా ఓటర్లు 398 మందికిగాను 305మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

నియోజకవర్గంలో 95శాతానికిపైగా పోలింగ్ నమోదైన కేంద్రాల వివరాలు

పోలింగ్‌కేంద్రంనంబరు	గ్రామం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
87	ముక్త్యాల	688	671	97.53
72	తిరుమలగిరి	1137	1101	96.83
200	సుబ్బాయిగూడెం	604	582	96.36
4	రామచంద్రునిపేట	658	634	96.35
193	తోటచర్ల	762	733	96.19
21	బలుసుపాడు	965	927	96.06
90	వేదాద్రి	764	733	95.94
117	దేచుపాలెం	858	823	95.92
222	రుద్రవరం	852	817	95.89
214	కొణతాత్మకూరు	486	466	95.88
130	లింగాల	781	746	95.52
208	మాగల్లు	731	698	95.49
97	పోచంపల్లి	901	860	95.45
98	పోచంపల్లి	1031	984	95.44
115	మంగొల్లు	568	542	95.42
102	గౌరవరం	1188	1132	95.29
2	తక్కెళ్లపాడు	786	749	95,29
201	గుమ్మడిదుర్రు	1017	969	95.28
212	జొన్నలగడ	938	893	95.20
198	కొళ్లకూళ్ల	1084	1030	95.02

కాలు దువ్వుతున్న పందెం రాయుళ్లు

- నందిగామలో అభ్యర్థుల గెలుపోటములపై జోరుగా పందేలు
- తగ్గేదేలే అంటున్న బెట్టింగ్ రాయుళ్లు



నందిగామ: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ దగ్గర పడుతున్న కొద్దీ నందిగామ నియోజకవర్గంలో బెట్టింగుల జోరు రోజురోజుకు పెరుగుతోంది. నందిగామలో బరిలో నిలిచిన అభ్యర్థుల గెలుపోటములు, వారికి వచ్చే మెజార్టీ, రాష్ట్రంలో ఆయా పార్టీలకు వచ్చే సీట్ల సంఖ్య తదితర అంశాలపై పందెంరాయుళ్లు జోరుగా పందేలు కాస్తున్నారు. రాష్ట్రంలో ఆయా పార్టీలకు చెందిన పలువురు ప్రముఖులు ఎన్నికల బరిలో నిలిచినచోట వారి గెలుపోటములు, వారికి వచ్చే మెజార్టీలపై కూడా పందేలు వేస్తున్నారు. నియోజకవర్గంలో ఈసారి 87.56 శాతం పోలింగ్ నమోదుకాగా, మహిళలతో పాటు వృద్ధులు కూడా పెద్దసంఖ్యలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. దీంతో మహిళలు, వృద్ధుల ఓట్లు ఎన్నికల్లో ఆయా అభ్యర్థుల జయాపజయాలను ప్రభావితం చేస్తాయనే చర్చ రాజకీయ వర్గాల్లో విస్తృతంగా సాగుతోంది.

అధిక వడ్డీలకు అప్పులు..

నందిగామ నియోజకవర్గంలో బెట్టింగ్‌ల పర్వం జోరుగా సాగుతోంది. ఎన్నికల ఫలితాలపై పందేలు కాసేందుకు పలువురు పందెంరాయుళ్లు అధికవడ్డీలకు అప్పులు చేస్తుండగా, మరికొందరు తమ ఆస్తులను తాకట్టుపెట్టి సైతం అప్పు చేసేందుకు వెనుకంజ వేయడంలేదు. ఇక కొన్ని గ్రామాల్లో ఎకరాల కొద్దీ భూములను పందెం కాస్తూ ప్రత్యేర్థులకు సవాలు విసురుతున్నారు. ఈ పందేలకు సంబంధించిన నగదును మధ్యవర్తి వద్ద ఉంచుతూ ఈ మేరకు షరతులు రాసుకుంటుండటం గమనార్హం. 2019 ఎన్నికల్లో నియోజకవర్గంలో ఎన్నికల పందేల కారణంగా సుమారు రూ.50కోట్లు చేతులు మారినట్లు సమాచారం. ఈ ఎన్నికల పందేల కారణంగా తలెత్తిన వివాదాలతో పలువురు పందెం రాయుళ్ల పోలీసుస్టేషన్ మెట్లు ఎక్కిన ఉదంతాలు కూడా ఉన్నాయి.

ఎక్కడ చూసినా పందేల చర్చే..

ప్రస్తుతం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ఎక్కడ నలుగురు గుమ్మికూడిన రాజకీయ చర్చలే వినిపిస్తున్నాయి. ఈ చర్చలు కాస్తా కొన్నిచోట్ల పందేలకు దారితీస్తున్నాయి. నియోజకవర్గంలో ఆయాపార్టీల గెలుపోటములపై పందెంరాయుళ్లు రూ.పది వేల నుంచి లక్షల్లో పందేలు కాస్తున్నారు. కొంతమంది గ్రూపుగా ఏర్పడి రూ.కోటి వరకు పందేలు వేసినట్లు నందిగామలో జోరుగా ప్రచారం సాగుతోంది. ఇలా నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.40కోట్ల వరకు పందేలు ఖరారైనట్లు రాజకీయవర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పలువురు ఎన్నారైలు పందేలు కాసేందుకు ఆసక్తిచూపుతూ, ఇక్కడి రాజకీయపరిస్థితులను అంచనా వేయడంతోపాటు పోలింగ్ ఏపార్టీకి అనుకూలంగా సాగిందంటూ ఫోన్లలో బంధుమిత్రులను ఆరా తీస్తున్నారని సమాచారం.

ఎవరి ధీమా వారిదే..

పందెం రాయుళ్లు ఎవరికి వారే తమపార్టీయే ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేస్తుండగా, మరికొందరు మండలాల వారీగా ఓట్ల లెక్కలు వేస్తూ రాజకీయచర్చలను మరింత వేడెక్కిస్తున్నారు. మొత్తమ్మీద ఎన్నికల ఫలితాలు వెలువడే సమయానికి నందిగామ నియోజకవర్గంలో ఈ పందేల వ్యవహారం మరింత రెట్టింపు మొత్తానికి చేరుకుంటుందని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇలా ఈ ఎన్నికల పందేలు బెట్టింగ్ రాయుళ్లలో ఎవరిని ఏ ఒడ్డుకు చేరుస్తాయో జూన్ నాలుగో తేదీన తేలనుంది.

విస్తృతంగా వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వీరులపాడు: ఎన్నికల పోలింగ్ అనంతరం రాష్ట్రంలో నెలకొన్న హింసాత్మక ఘటనల దృష్ట్యా మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకున్నట్లు వీరులపాడు ఎస్‌ఐ మహాలక్ష్మణుడు తెలిపారు. మండలంలోని పొన్నవరం క్రాస్ రోడ్డు వద్ద నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం ఆయన విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేని పలు ద్విచక్రవాహనాలు, కార్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మారణాయుధాల రవాణ, కొత్త వ్యక్తుల సంచారం తదితర అంశాలకు సంబంధించి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. మండలంలో ఎవ్వరు కూడా ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడకుండా ఉండాలని హెచ్చరించారు. అనవసర వివాదాలకుపోయి ఇబ్బందులు పడవద్దని హెచ్చరించారు.

15 కేసులు నమోదు



నందిగామ: తూనికలు, కొలతలశాఖ అధికారులు సోమవారం నందిగామ పట్టణంలోని పలు దుకాణాలతోపాటు వీరులపాడు మండలంలోని ఇండేన్ గ్యాస్ గోడౌన్‌లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల్లోని వస్తువుల ఎమ్మార్పీ ధరలు, తయారీ తేదీలు, తూకం, కొలతలకు సంబంధించి వ్యత్యాసాలను గుర్తించి ఈమేరకు 15కేసులు నమోదు చేసినట్లు ఆశాఖ నందిగామ అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్.భానుప్రసాద్ తెలిపారు. తనిఖీల్లో సిబ్బంది సులేమాన్, ఈశ్వరరావు, ఖాదర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ



జయంతిపురం(జగ్గయ్యపేట): మండలంలోని జయంతిపురం ఆంజనేయస్వామివారి ఆలయంలో నరసింహస్వామివారి పడిపూజ ఆదివారం రాత్రి అంగరంగవైభవంగా జరిగింది. గ్రామంలోని స్వామి వారి దీక్షా స్వాములు ప్రత్యేక మండపం ఏర్పాటు చేసి నరసింహ స్వామి వారికి పంచామృతాభిషేకం, అష్టోత్తర పూజలు చేశారు. అర్చకులు శ్రీధరాచార్యుల పర్యవేక్షణలో పూజలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో దీక్షాస్వాములు పాల్గొన్నారు.

ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక రామకృష్ణాపురం శ్రీఅలివేలు మంగ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవాలయంలో ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.

మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు



జగ్గయ్యపేట: నూతన విద్యాసంవత్సరానికి(2024–25) సంబంధించి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి తొమ్మిదవ తరగతి వరకు చదివే విద్యార్థులకు అవసరమైన అన్ని పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు ఎంఈవో చిట్టిబాబు తెలిపారు. విద్యాశాఖ నుంచి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చేరిన పాఠ్యపుస్తకాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మండలంలోని 61 పాఠశాలలకు సంబంధించి ఇప్పటివరకు 11,600 పుస్తకాలు వచ్చాయని వివరించారు. రెండో విడత కూడా పుస్తకాలు వస్తాయన్నారు. ఈ పాఠ్యపుస్తకాలను త్వరలోనే ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తామని ఎంఈవో వివరించారు.

ప్రతి గ్రామంలో పోలీసు నిఘా : ఏసీపీ



కవాతులో పాల్గొన్న ఏసీపీ, పోలీసులు

నందిగామ: డివిజన్ పరిధిలోని ప్రతి గ్రామంలో పోలీసు నిఘా కొనసాగుతోందని ఏసీపీ డాక్టర్ రవికిరణ్ తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల పోలింగ్ తర్వాత పలుచోట్ల అల్లర్లు జరిగిన నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలన్న సంకల్పంతో పోలీసుల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో కవాతు నిర్వహిస్తున్నారు. ఇదే క్రమంలో మండలంలోని అడవిరావులపాడులో సోమవారం పోలీసు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ రవికిరణ్ మాట్లాడుతూ గ్రామాల్లో అందరూ స్నేహభావంతో ఉండాలన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులుగా గుమ్మికూడి ఉండవద్దని ప్రజలకు సూచించారు. కవాతులో ఇన్‌స్పెక్టర్ హనీష్, ఎస్‌ఐలు దుర్గామహేశ్వరరావు, పండుదొర, పోలీసులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరాలతో ఎంతో మేలు



విద్యార్థులచే పుస్తక పఠనం చేయిస్తున్న గ్రంథపాలకుడు రామచంద్రుడు

కంచికచర్ల : గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కంచికచర్ల గ్రంథపాలకుడు అల్లూరి రామచంద్రుడు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. విద్యార్థులకు యోగా, చెస్ నేర్పించారు. ఈసందర్భంగా రామచంద్రుడు మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరాలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పకుండా ఈ శిబిరాలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వరరావు, కవి నీలం సర్వేశ్వరరావు, ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, బీడీసీ నిర్వాహకుడు శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాకారులు సాంస్కృతిక వారధులు

విజయవాడకల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు అన్నారు. ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ, శారదా కళాసమితి ఆధ్వర్యంలో వసంత రుతోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, రంగస్థల నటుడు ఏపీ విద్యుత్‌శాఖ చీఫ్ ఇంజినీర్ డాక్టర్ కేఎస్ పరబ్రహ్మం ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ కళాకారుల ప్రతిభకు ఎల్లులు లేవన్నారు. శారదా కళాసమితి అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు డాక్టర్ కేఎస్ పరబ్రహ్మం రంగస్థల సేవలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, విద్యావేత్త డాక్టర్ ఎంసీ దాస్, నీలం దుర్గారావు ప్రసంగించారు. నిర్వాహకులు పరబ్రహ్మం దంపతులను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమాన్ని శారదా కళాసమితి కన్వీనర్ ఎంఆర్ఎస్ ప్రకాశరావు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఘంటసాల పవన్‌కుమార్ బృందం కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించింది. డాక్టర్ పరబ్రహ్మం దుర్యోధనుని ఏకపాత్రను ప్రదర్శించారు.

మధురంలో గరళం

- పండ్లను మాగబెట్టేందుకు రసాయనాల వినియోగం
- పట్టించుకోని అధికారులు
- అనారోగ్యం పాలవుతున్న ప్రజలు



పేటలోని ఓ పరిపక్వత కేంద్రంలో రసాయనాలతో మగ్గబెడుతున్న మామిడి పండ్లు



కార్బైట్‌తో మగ్గి మార్కెట్‌లోకి వచ్చిన మామిడి పండ్లు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని కొందరు వ్యాపారులు కార్బైడ్ వంటి రసాయనాలతో ఆయా పండ్లను మాగబెట్టి విక్రయిస్తున్నారు. ఎలాంటి లైసెన్స్ లేకుండా పండ్లను మగ్గబెట్టే కేంద్రాలను నిర్వహిస్తున్నా..అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. నిబంధనల ప్రకారం వ్యాపారులు ఆహార పరిరక్షణ, ప్రమాణాల అమలు శాఖ అనుమతి తీసుకోవాలి. కాని ఇక్కడ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టు కొంతకాలంగా ఖాళీగా ఉండటంతో ఈ విషయాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో ఆహారపదార్థాల నాణ్యత పరిశీలన జరగడం లేదు. ఈ నేపథ్యంలో వ్యాపారులు జగ్గయ్యపేట మున్సిపాలిటీ నుంచి ట్రేడ్ లైసెన్స్‌లు మాత్రమే పొంది దర్జాగా వ్యాపారాలు నిర్వహిస్తుండటం గమనార్హం. జగ్గయ్యపేట పట్టణంలో పట్టణంలోని దస్తావేజుల బజారు, మసీదు సెంటర్, బలుసుపాడు రోడ్, గాలిమిషన్ రోడ్, కమలా సెంటర్ తదితర ప్రాంతాలలో అరటి, మామిడి, సపోట, దానిమ్మ పండ్ల పరిపక్వం కేంద్రాలు ఉన్నాయి. జగ్గయ్యపేట ప్రాంతంలో మామిడి అంతగా దిగబడి లేకపోయినా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి నుంచి నిత్యం పదుల సంఖ్యలో వాహనాలలో మామిడిపండ్లు సరఫరా అవుతుంటాయి. బనగానపల్లె, ఎంబాయి, బేనిషా తదితర రకాలకు ఎక్కువగా డిమాండ్ ఉండటంతో వ్యాపారులు అయా ప్రాంతాల నుంచి మామిడి కాయలను చౌకధరకు కొనితెచ్చి రసాయనాలతో పండిస్తున్నారు.

కార్బైడ్‌తో రోగాలకు అవకాశం..

కార్బైడ్‌తో మాగబెట్టిన పండ్లను తింటే అల్సర్, నాడి, కాలేయ, చర్మ సంబంధ వ్యాధులు వస్తాయని స్థానిక ప్రభుత్వ వైద్యాధికారులు చెబుతున్నారు. చిన్నారులకు అనారోగ్యం కలుగుతుందన్నారు. గర్భిణులు ఈ పండ్లు తింటే పుట్టబోయే శిశువులకు జన్యుపరమైన లోపాలు, అనారోగ్యం, ఫిట్స్, జ్ఞాపకశక్తి తగ్గడం, చర్మంపై దద్దుర్లు రావటం, నల్లబడటం, శ్వాసకోశవ్యాధులు తదితర దుష్పరిణామాలు కూడా వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

గుర్తించడం ఇలా...

కృత్రిమంగా పండించిన పండు అంతా ఒకే రంగు ఉంటుంది. కోసినపుడు లోపలి భాగం పక్వంగానూ, మిగతా సగం అపరిపక్వంగా ఉండి సరైన రుచి లేకుండా ఉంటుంది. పండిన వాసన ఉండదు. కాని కోసినపుడు లోపలి భాగం మొత్తం ఒకేరకమైన పరిపక్వం ఉంటుంది. ఎథిలీన్ ఛాంబర్స్‌లో మగ్గిన పండ్లు మాత్రం ఒకేరకమైన రంగు, రుచి,వాసనతో సహజ పరిపక్వతకు దగ్గరగా ఉంటుంది. పండ్లను ధారగా ప్రవహించే నీటి క్రింద మూడు నిమిషాలు ఉంచి శుభ్రం చేసి తొక్కను తీసి తింటే కొంతవరకు రసాయనాల ప్రభావం తగ్గుతుంది.

అధికారుల తనిఖీలు శూన్యం..

ప్రస్తుతం మార్కెట్‌ను మామిడి పండ్లు ముంచెత్తాయి. కొందరు వ్యాపారులు జగ్గయ్యపేటలో తాత్కాలికంగా షాపులను, గోడౌన్‌లను, ఇళ్లను అద్దెకు తీసుకొని పరిపక్వత కేంద్రాలను నిర్వహిస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వీరు కాల్షియం కార్బైట్‌ను ఉపయోగించి పండ్లను త్వరగా పండేలా చేసి విక్రయిస్తున్నారు. సీజనల్‌వారీగా వచ్చే పండ్లను తప్పక కొనుగోలు చేస్తూ ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పండ్ల పరిపక్వ కేంద్రాలను తనిఖీ చేయడంతోపాటు పండ్లను మాగబెట్టేందుకు కార్బైడ్‌ను వినియోగించుకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజారోగ్యంతో చెలగాటం



నందిగామ మార్కెట్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న మామిడి పండ్లు

నందిగామ: సీజన్ల వారీగా లభించే ఫలాలంటే ప్రతిఒక్కరికీ మక్కువ. వీటిలో మామిడిది ప్రత్యేక స్థానం. మామిడికి ఉన్న డిమాండ్‌ను ఆధారం చేసుకుని నందిగామలో కొందరు వ్యాపారులు కృత్రిమ పద్ధతిలో వీటిని మాగబెట్టి ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు.కార్బైడ్ ఉపయోగించి పండ్లను మాగబెట్టడం చట్టరీత్యా నేరమని తెలిసినప్పటికీ, ధనార్జనే ధ్యేయంగా కొందరు వ్యాపారం చేస్తున్నారు. కొనుగోలుదారులకు దీనిపై పెద్దగా అవగాహన లేకపోవడంతో కృత్రిమంగా పండించిన వాటిని కొనుగోలు చేసి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. ముఖ్యంగా నందిగామ ప్రాంతంలో గాలివానలకు మామిడికాయలు రాలిన సమయంలో వాటిని ఒక్కరోజులో మగ్గ పెట్టేందుకు వ్యాపారులు కార్బైడ్‌ను వినియోగిస్తున్నారు.

రూ.40పైన పలుకుతున్న మామిడికాయ..

మార్కెట్‌లో ప్రస్తుతం మామిడికాయ ఒక్కోటి రూ.40 వరకు పలుకుతోంది. మామిడిని కార్బైడ్ ద్వారా కృత్రిమంగా మాగబెడుతుండటంతో అది కాస్తా విషతుల్యమవుతోంది. ముఖ్యంగా చెట్టుపై నుంచి కాయలు రాలి కిందపడిన సందర్భాల్లో నాలుగు నుంచి ఐదు రోజులు మాగబెడితే అవి కుళ్లిపోయే ప్రమాదముంది. ఇలాచేస్తే తమకు నష్టం వస్తుందని భావించిన వ్యాపారులు కార్బైడ్ ద్వారా వీటిని పండిస్తుండటంతో ఒక్కరోజు వ్యవధిలోనే అందమైన రంగులో ఇవి చూపరులను ఆకర్షిస్తాయి. అయితే ఇలా మాగిన పండ్లను తింటే ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తున్నాయని వైద్యులు సూచిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని నందిగామ వాసులు కోరుతున్నారు.

కృత్రిమంగా మగ్గపెడితే చర్యలు..



వ్యాపారులు మామిడి పండ్లతోపాటు ఇతర పండ్లను కూడా సహజసిద్ధంగా పండిన తరువాతనే మార్కెట్‌లో అమ్మకాలు చేయాలి. అలాకాకుండా రసాయనాలతో పండ్లను కృత్రిమంగా మగ్గబెట్టడం చట్టరీత్యా నేరం. ఇటువంటి చర్యలకు పాల్పడేవారిపై కఠినచర్యలు తీసుకుంటాం. అవసరమైతే షాపులను సీజ్‌చేస్తాం.

శివకోటేశ్వరరావు, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్, జగ్గయ్యపేట

వీఆర్వోలతో సమావేశం

జుజ్జూరు(వీరులపాడు): వీఆర్వోలు ఆయా గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ రాజకిషోర్ ఆదేశించారు. తన కార్యాలయంలో సోమవారం ఆయన మండలంలోని వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాజకిషోర్ మాట్లా డుతూ రైతుల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించే వీఆర్వోలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.